# లాలస

-విహారి

అప్పుకోసం వస్తున్నవాడి మొహంలా ఆకాశం మబ్బు పట్టింది. అప్పులవాడి గొంతులా నింగి ఉరుముతోంది. వాన వచ్చేట్టే వుంది.

బెరుకు బెరుగ్గా పెరడుదాటి వరండాకేసి నడుస్తున్నాడు నారాయణ. "రా... రా... నారాయణా. ఈ పొద్దో రేపో నువ్వొస్తావని అనుకుంటున్నాను" మునికృష్ణయ్య.

పేలవంగా నవ్వుతూ, వచ్చి నిస్సత్తువగా బెంచిమీద కూర్చున్నాడు నారాయణ.

ఎవరో వయసు మళ్లిన మనిషి నిరాశగా బయటికి పోతున్నాడు.

"ఆనాడేమో నిండు అవస్థ సారూ– మీరే ఆదుకోవాలంటూ తండల్ తీసుకుని బోవటం, ఆ మీద అయిపుండరు. జనం తగరారు జేస్తా ఉండారు" అని క్షణం ఆగి, తన చిత్రా మూసి, నారాయణని చూస్తూ "నీ మాట కాదనుకో" అన్నాడు మునికృష్ణయ్య.

"బిడ్డ బావుందా?" పరామర్శ. బట్టతలని చేత్తో నిమురుకున్నాడు.

"ఆఁ. పురుడు రోజులు" నారాయణ.

"ఆమె పిల్లకి రెండేళ్లు దాటినాయి కదూ..."

"ఆఁ..." అని మునికృష్ణయ్య మొహంకేసి చూసి, అంతలోనే చూపు మరల్చుకుని, నేలచూపులు చూస్తూ "మూడు వేలన్నా కావాల" అని ఆగి, "అవసరంలో ఆదుకునే వోనివి నువ్వే కదా నాకు" అన్నాడు నారాయణ.

"ఇప్పుడు రేటు మరి ఐదు నడుస్తుండాది" వడ్డీ గురించిన హెచ్చరిక!

నారాయణకి గుండెల్లో గుబుల్లేచింది. ఇప్పటివరకూ తనలాంటి ఉద్యోగులకి మూడు రూపాయల వడ్డీకిస్తున్నాడు. పెంచుతున్నాడన్నమాట. అయినా చేసేదేం వుంది? అవసరం అలాంటిది. బిడ్డ పురుటి ఖర్చు, ఇంటి ఖర్చు.. తప్పదు. "ఈసారికి పాత రేటు..." నసిగాడు.

"బిడ్డలుగలవోడివి. నిన్ను బీటికి పంపలేను గదా నారాయణా. సరెగానీ, నువ్వంతగా అడిగే వోడివీ గాదు. నాలుగు జేసుకుందాంలే" అని లేచి లోపలికి వెళ్లాడు. వెళ్తూ వెళ్తూ కాగితాలు నారాయణ ముందుంచి వెళ్లాడు. ఇంతలో వాకిట్లో మునికృష్ణయ్య భార్య పద్మావతమ్మ జ్యూస్ గ్లాస్‌తో ఎదురైంది. లోపలికి నడుస్తూనే గ్లాసందుకున్నాడు మునికృష్ణయ్య.

కాగితాలు చూశాడు నారాయణ. ఆలోచనలు ముసిరినై.

జీతం– బీ షీట్‌లో కట్‌లే ఎక్కువైపోయినై. పిఎఫ్ లోను, సొసైటీలోను, అందులో షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్, పండగ అడ్వాన్సూ, లేని తుపాను అడ్వాన్సూ, క్వార్టర్స్ లీజూ– అన్నీ పోను చేతికొచ్చేది బియ్యానికీ, పాల ప్యాకెట్లకీ చాలటంలేదు. ఎవరో మిత్రుడన్నట్టు నెలంతా పాపర్ వీకే– తమలాంటి వాళ్లకి. చేబదుళ్లూ, భార్య వొంటిమీద ఇంకా మిగిలిందీ చిన్నమో, అరచిన్నమో ఉంటే అంగడికిచ్చేయటం, ఎవరన్నా బంధువులో, మిత్రులో వచ్చి పిల్లల చేతిలో పదో అయిదో పెడితే దాన్ని ఉప్పుకీ పప్పుకీ వాడుకోవడం, ఆర్నెల్లకోసారి సొసైటీ లోన్ రెన్యువల్‌కి ఆ సెక్రటరీని దేబిరించడం!

అప్పు చేయడం తప్పనిసరి.

"వానపాము బతుకైపోయింది. సాలెగూడు బతుకైపోయింది. నికృష్టపు బతుకైపోయింది!"

తనను తాను నిందించుకుంటున్న నారాయణ!

ఆయన ఆలోచనల్ని భంగపరుస్తూ పద్మావతమ్మ వచ్చింది.

"కాఫీ తీసుకో అన్నా" అంటూ. నారాయణ గ్లాసందుకున్నాడు. ఆమె వెళ్లిపోయింది.

నారాయణ కాఫీ ముగిస్తుంటే బయటికొచ్చాడు మునికృష్ణయ్య. "ఏమో ఆలోచిస్తాండావు" అంటూ. చేతిలోని నోట్లు నారాయణకిచ్చాడు.

డబ్బు తీసుకుని లెక్కించుకున్నాడు నారాయణ. మామూలు పద్ధతి ప్రకారం నెల వడ్డీ ముందే మినహాయించుకుని మిగిలిన డబ్బే యిచ్చాడు. కాగితాల మీద సంతకాలు చేసి ఆయన చేతికిచ్చాడు. మునికృష్ణయ్య కాగితాలు అందుకున్నాడు. ఆయన చేతులకున్న ఐదు ఉంగరాలూ తనని చూసి నవ్వినట్లనిపించింది నారాయణకి. సెలవు తీసుకుని ముందుకు నడిచాడు.

పదిహేనేళ్ల సంఘటనలు నారాయణ ఆలోచనల్ని వెనక్కి లాగేయి.

మునికృష్ణయ్యా, తనూ ఒకేసారి చేరేరీ కంపెనీలో. తాను అసిస్టెంట్‌గా చేరితే, మునికృష్ణయ్య గ్రూప్–డిలో చేరాడు. అంటే ప్యూన్. నాలుగేళ్లల్లో రికార్డ్ అసిస్టెంట్ అయ్యాడు. అక్కణ్ణుంచీ యూనియన్‌లో చాలా ముఖ్యమైన మనిషిగా ఎదిగి 'కింగ్ మేకర'యినాడు. నెమ్మదిగా వడ్డీ వ్యాపారంలోకి దిగాడు.

"పెళ్లి చేసుకోగానే వచ్చిన కట్నం సొమ్మే పెట్టుబడి" అంటూ తనకు తానే చెప్తూ వుండేవాడు. అతని బిజినెస్‌కి ఘనమైన పేరు– 'ఫైనాన్స్'. అప్పు కావలసిన వారి సంఖ్యని అతనే తెలివిగా పెంచుకుంటూ, తానూ పెరిగాడనేవాళ్లు సహోద్యోగులు. మునికృష్ణయ్య పలుకుబడీ, పదవీ పెరుగుతూ వచ్చాయి. యూనియన్లో అతను చాలా ముఖ్యమైన మనిషి. టౌన్లోనూ తను కుల సంఘానికి పెద్ద. కావాలనే అక్కడేమీ పదవులు తీసుకోలేదని ఆఫీస్‌లో సన్నిహితులు చెవులు కొరుక్కుంటూ వుంటారు. దానికి పెద్ద రాజకీయం ఉందంటారు.

సన్నగా తుంపర మొదలైంది. దిక్కులు చూస్తూ, తన ఆలోచన సాగిస్తూ నడుస్తున్నాడు నారాయణ.

తన విషయంలో ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే వుండిపోయింది. ఇంట్లో చరాస్తిగా మాత్రం భార్యా, నలుగురు పిల్లలూ వచ్చారు! ఉన్న అమ్మా, నాన్నా పోయారు. సెంటు పొలం లేదు. గజం స్థలం సంపాదించిందీ లేదు. పిల్లలు పెద్దవాళ్లవుతున్న కొద్దీ– మునికృష్ణయ్య అప్పు జీవనదిలా సాగుతూ వస్తున్నది. కూతురూ, కొడుకూ, కూతురూ, కొడుకూ– ఇదీ వరస. వీళ్ల అవసరాలకి ఆపద్బంధువు మునికృష్ణయ్యే. పెద్ద కూతురు దుర్గ పెళ్లికీ ఆయనే చాలావరకూ అప్పు పెట్టాడు.

## గువ్వలా ఒదిగి...

నీ కళ్ళు కురిపించే / వెన్నెల జల్లుల్లో తడుస్తూ
నీ దేహ కాంతులు సోకి మెరిసే
నక్షత్రాలతో నీ గురించే ముచ్చటిస్తూ
నా కుంచె అంచును / నీ పెదవుల ఎరుపులో ముంచి
పశ్చిమాన అరుణ వర్ణపుష్పాన్ని
అద్భుతంగా చిత్రీకరిస్తూ
నీ పొడవాటి వాలుజడలో చిక్కుకొని
దారి తెన్ను తెలియక అలమటిస్తున్న
లేతమల్లెలను బుజ్జగిస్తూ/ఆహ్లాదాన్ని పంచే మధుమాసంలో
ఎలకోయిల మధుర గానంలో
నీ ఊసులను వెదుక్కుంటూ
నీ అద్భుత సౌందర్య సామ్రాజ్యంలో / పయనిస్తూ–
దిగంతాల ఆవలకు వెళ్ళి/విచ్చుకొంటున్న అనుభూతుల
లోకాల్లోకి ఎగిరిపోతాను / ఒక సున్నితమైన
ఒక మహోన్నతమైన భావానికి రూపునిచ్చి
గతమనుకున్న దానిని వర్తమానంలో నిల్పి
భవిష్యత్తుపై ఆశలు రేపావు నేస్తం!
నీవు నేను కలసి ఈ జగతిని మరచి
ఎవరూలేని ఏకాంతంలో/ఆనందపు అంచులను చూసి
నీ గుండె గూడులో గువ్వలా ఒదిగి
నా బతుకు పండించుకుంటాను!

## ఆత్మ సౌందర్యపు అంతరిక్షం

మల్లెలు మత్తుగా విరిసే వేళ
మల్లెపూల తోరణాల్లాంటి నీ చిరునవ్వులు
మధురంగా గుర్తుకు వస్తాయి
గులాబీలు గమ్మత్తుగా గుబాళించే వేళ
నీ తాలూకు జ్ఞాపకాల అత్తరు సీసా ఒలికి
అనుభూతుల సౌరభాలు అలముకుంటాయి
చిరుగాలికి నీ చెవుల లోలాకులు
అలవోకగా ఊగుతుంటే
ఏవో మధుర భావాలు నా మదిలో
అంతర్లయగా ప్రవహిస్తూ ఉంటాయి
నీ వాలు చూపుల జల్లులలో తడిసి
ముద్దవుతుంటే ఓ ఆత్మీయ వీచిక
నను పరవశింప చేస్తుంది
నీ కౌగిలింతల మమతల వెచ్చదనంలో
మైమరచి మరో లోకపు
సువర్ణ కవాటాల్లాంటి నీ కళ్ళ నుంచి
నీ అంతరంగం లోతుల్లోకి వెళ్లి
ఓ అచేతనావస్థలో కూరుకపోతానేమో!
అవును చెలీ– / పూల సుగంధాల్ని మోసుకొచ్చే
గాలి కెరటాలు నీ తనువు సోకి
నీ సహజ పరిమళాలను పీల్చి
అంతుచిక్కని విభ్రాంతికి గురి అవుతుంటే
నీ ఎర్రటి పెదవులు పలికే తియ్యటి ముచ్చట్లు
నా మనస్సును అలౌకిక ఆనందంతో
ఈ విశ్వపు అంచులకు తీసుకపోతాయి
నీ ఆత్మ సౌందర్యపు అంతరిక్షంలో
అహర్నిశలు పరిభ్రమించి
వెలుగులీనే ధ్రువతారగా నిలిచిపోతాను.

-గోపాలుని వెంకటేశ్వర్లు

## గ్రామదృశ్యం

**కో**డి కూతల ప్రథమ ధ్వానము
పాల ధారల పాత్ర గానము
పెరుగు చిలికే ప్రణవ నాదము
లేగదూడల అంబారావము
తాటి తోపుల వెనుక నుండి-
తొంగి చూచెను బాలభానుడు
పచ్చిగడ్డి తినగ పశువులు
మోరలెత్తి సాగుచున్నవి
కళ్ళములలో నవ ధాన్యరాసులు
గోతములకై చూచుచున్నవి
బండెడ్ల మెడలోని మువ్వలు
ఘల్లు ఘల్లున మ్రోగుచున్నవి
విద్యార్థులు బడులకేగగ
వేవేగమె నడచుచుండిరి
పల్లెబాలలు గోపాలురై-
పొలము దెసగా సాగుచుండిరి
చదువు విలువలు తెలిసి వారు...
రాత్రి చదువుల నేర్చుచుండిరి
పూలజడలతో పల్లెపడుచులు
ముచ్చటలలో తేలియాడుచు
రంగవల్లులు చిత్రించుచు
తుమ్మెదపాటలు పాడుచుండిరి
పట్టమేగగ కాల్వగట్టున బస్సుకై-
ఉద్యోగులందరు వేచియుండిరి
పాలు-నీరు కావడులతో
పాలేరులు సాగుచుండిరి
ఊరిపెద్దలు రచ్చబండపై
మంచి చెడ్డల నాడుచుండిరి
పాడి-పంటల మాటాడుచు
పల్లె వృద్ధిని చర్చించుచుండిరి
సంప్రదాయపు వేదఘోషతొ
భక్తుల సన్నుతులతో
శుభ ఘంటానాదములతో
దేవాలయము ధ్వనించుచున్నది
ఆకాశవాణి, దూరదర్శన, దూరవాణిలే గాక-
కంప్యూటర్ వాసనలు కూడా
స్పష్టముగా కన్పట్టుచున్నవి
పాత-క్రొత్తల మేలుకలయిక
గ్రామ ప్రగతికి సోపానమైనది.

**-ఆచంట హైమవతి**

-కాళ్లీడ్చుకుంటూ నేరుగా ఇంటికొచ్చాడు నారాయణ.

❖ ❖ ❖

క్యాంటీన్ హాలంతా కిటకిటలాడుతోంది. మాటల సందడి.

నారాయణ ఒక టేబుల్ దగ్గరికి కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

అప్పుల మాఫీ గురించి చర్చ జోరుగా సాగుతోంది.

"ఎద్దుపుండు కాకికి ముద్దా. ఏ ప్రభుత్వం ఏం చేసినా- మధ్యతరగతోళ్లం. మన ఖర్మమిట్టా కాలింది. అప్పుల ఊబిలో కొట్టుకు చావాల్సిందే. రాజకీయ నాయకులకీ పట్టదు, యాజమాన్యానికీ పట్టదు. సంఘాలకీ పట్టదు- మన సంగతి. థూ... కుక్క బతుకైపోయింది" చంద్రం మాటలు హెచ్చు స్వరంతో, ఆవేశంతో వచ్చాయి.

నలుగురూ నాలుగు విధాలుగా అభిప్రాయాలు చెప్తున్నారు.

మధ్యలో కొందరు సర్వజ్ఞులు ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల గురించి ఆవేశపడుతున్నారు. అసిస్టెంట్ శివయ్య ఆర్థికవేత్తల్ని బూతులు తిడుతూ, బియ్యం ధర ఎప్పుడెప్పుడు ఎంతెంత పెరిగిందో చెప్తున్నాడు. అతని మాటలకి అడ్డుతగులుతూ చంద్రం పాల ధర ఆరుసార్లు పెరగటం గురించి వివరాలిస్తున్నాడు. "అంతా స్లో పాయిజనింగ్. దరిద్రం, దరిద్రం, అంతా దొంగ ముండా కొడుకులు" అని గొంతు తగ్గించి "అంతెందుకు, మునికృష్ణయ్య వడ్డీ రేటు కూడా పెరిగింది. ఛీ... అసలు మనకు బుద్ధిలేదు" అని చేతులు గాల్లో ఆడిస్తూ లేచి వెళ్లిపోయాడు.

అందర్నీ వింటున్నాడు నారాయణ.

అన్నీ వింటున్నాడు నారాయణ.

కాఫీ తాగుతున్నాడు నారాయణ. అతని మేథలో ఎన్నో ఆలోచనలు. హఠాత్తుగా పొలమారింది. కళ్ల వెంట నీరు తిరిగింది. కాఫీ వదిలేశాడు. రెండు మూడుసార్లు కేకరించి నీళ్లు తాగేడు.

"తేనెలో ఈగలం. మన బతుకులింతే. రిటైర్ కాకుండా పోవాలని కోరుకోవటమే మనం చేయ గలిగింది. కనీసం మనవాళ్లన్నా సుఖంగా బతుకుతారు. ఒక పిల్లాడికో, పిల్లకో ఉద్యోగం ఖాయం. గ్రూప్ ఇన్సూరెన్స్ బాగానే వస్తుంది. సొసైటీ లోను వాళ్ల ఇన్సూరెన్స్‌తోనే పోతుంది. పిఎఫ్, గ్రాట్యుటీ, పాలసీల డబ్బు... బాగానే వుంటుంది. ఈ కుక్క చావుకంటే అదే బెటర్" శివయ్య సమస్యకున్న మరో కోణాన్ని చూపేడు.

నారాయణ మనస్సు దారపు కొసని అందుకుంది. శివయ్య వైపు అదోలా చూశాడు. కృష్ణభగవానుడు గుర్తుకొచ్చాడు. ఏది కర్తవ్యం?

కాళ్లీడ్చుకుంటూ, బుర్రలోని చైతన్య స్రవంతితో తన సీట్లోకొచ్చి కూర్చున్నాడు.

"లంచ్ అవర్ అయిపోయి అరగంటయినా లోపలికి రారు దొరలు!" విసుక్కుంటున్నాడు ఆఫీసరు. ఆయన మొహంమీద ఇంటూ మార్కులూ, ప్లస్ మార్కులూ! మొహం చెండు కోవడమంటే ఇదేనా అనిపించింది నారాయణకి. పేలవంగా నవ్వుకుని ఫైల్ తీశాడు.

❖ ❖ ❖

భోజనం అయింది. కుర్చీలో కూర్చున్నాడు నారాయణ. అది కుసకుసలాడింది. ఆ కుర్చీకి కూసాలు వదులైనై. 'నాలాగానే నసుక్కుంటోంది' అనుకున్నాడు.

చీరె కొంగుకు చెయ్యి తుడుచుకుంటూ వచ్చింది సరస్వతి. నారాయణ భార్య. కూచుంది. ఆమెవైపు పరీక్షగా చూశాడు ఉతికిన చీరె, జాకెట్, పాతబడినై. కట్టుడు చీరలు కొనిపెట్టి కూడా చాలా నెలలయింది. చేతిలో నాలుగు రాళ్లు కనిపించినా పిల్లల అవసరాల్ని ఏర్పాటు చేయటానికే సరిపోతున్నై. తన అసమర్థతంతా కలిసి ఆమెని పుస్తెల తాడుతో మిగిల్చింది అనిపించింది. మనసులో అపరాధ భావం కదిలింది.

"ఏవిటి మామయ్యా ఆలోచిస్తున్నావ్?" అడిగింది. ఆమె భర్తని మామయ్యా అనే పిలుస్తుంది చిన్నప్పట్నుంచీ. నారాయణ ఆమె మేనమామే.

మునికృష్ణయ్య వడ్డీ రేటు పెంచటం, తాను అప్పు తేవటం అంతా నిమ్మళంగా ఆమెకి చెప్పాడు నారాయణ. కష్టం సుఖం కలబోసుకుంటుంటే టైమ్ తెలీలేదు.

పది దాటింది. లైట్ తీసింది సరస్వతి. చాపమీద పిల్లల పక్కకి చేరింది. నారాయణ అన్యమనస్కంగా మంచం దగ్గరికి వెళ్లాడు. దుర్గ కూతురు రాణి పక్కలో అడ్డంగా పడుకుని వుంది. ఆ పిల్లని సరిగా పడుకోబెట్టి నడుం వాల్చాడు.

నారాయణ మనసునిండా ఆలోచనలు.

కళ్లముందు క్యాంటీన్ హాలు దృశ్యమే కనిపిస్తోంది. శివయ్య మాటలే చెవుల్లో రింగుమంటున్నై. "రిటైర్ కాకుండా పోవాలని కోరుకోవటమే మనం చెయ్య గలిగింది. మనం పోయినా మన వాళ్లన్నా సుఖంగా బతుకుతారు"

-ఒక రాత్రివేళ మెలకువచ్చింది సరస్వతికి. లేచింది. బయట సన్నగా వాన కురుస్తోంది. మంచంలో నారాయణ కళ్లు కొలిమిలో మండుతున్న ఇనుప గుండ్లులా వెలుగుతున్నై. మామయ్యని అలా చూసేసరికీ భయం వేసింది.

మంచం దగ్గరికి వెళ్లింది.

"ఏవిటి?" అడిగింది. మాట మార్దవంగా వుంది.

కళవళపడ్డాడు. ఆమెవైపు చూశాడు. గుడ్డిదీపం వెలుగులో చెక్కపేడులా వుంది. మాట పెకల్చుకుని "ఏం లేదు, పడుకో" అన్నాడు. ఆమె పడుకుంది.

తన పక్కనున్న పిల్లని కొంచెం జరిపి, కాళ్లు ముడుచుకుని పడుకున్నాడు నారాయణ.

ఈదురగాలి వీస్తోంది. పిల్లకి పల్చటి దుప్పటి కప్పాడు.

నారాయణకి నిద్రపట్టటంలేదు. శివయ్య మాటలే చెవుల్లో జోరీగలా పీడిస్తున్నాయి. చాలాసేపటికి ఏదో నిర్ణయానికి వచ్చినవాడిలా ఊపిరి పీల్చుకున్నాడు. నెమ్మది మీద కునుకు పట్టింది.

-ఉన్నట్టుండి ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు.

కాళ్లకి అడ్డంగా,

కాళ్లమీద- రాణి! బంధం వేసి పడుకుంది!

లేవాలని ప్రయత్నించాడు. ఆ పిల్ల లేవనీయలేదు.

కునుకు తీయటానికి ముందు యుద్ధం ముగిసిందనుకుని ఊపిరి పీల్చుకున్నాడు.

కానీ...! ఈ బంధం?...

బయట వాన కురుస్తున్నా, నారాయణ వొళ్లంతా చెమటపట్టింది. గొంతెండిపోయినట్లయింది..

పెదవులు తడి చేసుకున్నాడు.

ఉప్పగా లేదు.

భయం పోయింది. బాధ మిగిలినట్లుంది! పిల్లని పైకి తీసుకుని పక్కన పెట్టుకుని, దగ్గరికి తీసుకున్నాడు! బయట వాన కురుస్తూనే వుంది!

■